www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 20 | డిసెంబర్ | 2025
పేజీలు : 8

# ఉపాధి హామీ పథకంపై 22న ఆందోళన

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పేరు మార్పుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందని దీనిని నిరసిస్తూ ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాధించుకున్నామని బిజెపి ఇప్పుడు పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికే పని దినాలను తగ్గించిందని దినసరి వేతనంలో భారీగా కోతలు పెట్టడంతో పాటు రక రకాల కొర్రీలు పెడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలను బిజెపి ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రానున్న కాలంలో అసలు పథకాన్ని రద్దు చేసే ప్రమాదం ఉందన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ఖమ్మంలో శరవేగంగా అభివృద్ధి పనులు



**-జూన్ నాటికి సీతారామ ద్వారా సాగునీరు**
**-మంచుకొండ ఎత్తిపోతల పథకం విస్తరణ**
**-అమరావతి తరహాలో టిటిడి ఆలయం**
**-మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రస్తుతం చేపట్టిన పనులన్నీ నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఖిల్లా రోప్‌వే పనులు రెండు మాసాలు ఆలస్యమయ్యాయని శాశ్వత నిర్మాణం కావడంతో నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్దార్ పటేల్ మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం రెండు నెలల్లో పూర్తవుతుందన్నారు. అండర్ డ్రైనేజీ పనులు పురోగతిలో ఉన్నాయని చెరువుల నుంచి వచ్చే వరద నగరంలోకి రాకుండా నేరుగా మున్నేరులోకి చేరేవిధంగా పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 20 ఎకరాలు కేటాయించామని అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ అథారిటీ ద్వారా స్టేడియం నిర్మాణం జరుగుతుందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల, హాస్టల్స్ నిర్మాణాలను త్వరలో పూర్తి చేయనున్నామన్నారు. మున్నేరుపై నిర్మాణం జరుగుతున్న కేబుల్ బ్రిడ్జి ఖమ్మంకు తలమానికం కానుందని వాస్తవానికి మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉండగా అధిక వర్షాల కారణంగా రెండు నెలలు ఆలస్యమైందని జూన్ నాటికి కేబుల్ బ్రిడ్జి పూర్తవుతుందని తుమ్మల తెలిపారు. దశల వారీగా మున్నేరు వరద రక్షిత గోడలను పూర్తి చేస్తామని ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. హరిత హోటల్ నిర్మాణంతో పాటు

మిగతా 2లో..

# సారూ.. ఇదేం న్యాయం



OFFICE OF THE MADHIRA MUNICIPAL COUNCIL,
KHAMMAM (Dist.)., TELANGANA

Notice u/s sec 182 of the TS Municipal Act, 2019

Lr.Roc.No.G1/ Ward - 18 / 02/2025

Dated: 28 - 11 - 2025.

Sir/Madam,

Take notice under Section 182 of TS Municipal Act. 2019 the following portion/Building bearingH. No.12-417/1situated atWard. No. 18., Location ....ladak Bazar........, Madhira is in serious condition or likely to fall. You are hereby required as the Owner/Occupier to show cause by submitting your objections if any, within (7) days as to why the same should not be pulled down / Remove / Repair to prevent all causes of danger there from by this office at your expenses. You are entitled to make representation and adduce evidence if any on or before the above-mentioned date. Before removal the pending House and Water Taxes must be cleared.

Commissioner
Madhira Municipality

To
Sri/Smt...Billakanti Nageswara Rao.....
S/o, D/O, W/o ..........
H.no. ...12-417/1...ladak Bazar......
Ward.No., ...18....Assl.1175002876
Madhira.



500Rs.
INDIA NON JUDICIAL
Rs500
FIVE HUNDRED RUPEES
STAMP VENDOR
MADHIRA

**-పరిహారం ఇవ్వకుండానే కూల్చమంటారా**
**-ఓ కుటుంబ ఆవేదన**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెండు చిన్న చిన్న దుకాణాలే జీవనాధారం. అటువంటి జీవనాధారానికి ఎటువంటి పరిహారం ఇవ్వకుండానే కూల్చమనడం ఏమి న్యాయం సారూ అంటూ ఓ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తుంది. జీవన సమస్యగా మారిన ఈ వ్యవహారంపై పునః పరిశీలన చేయాలని వేడుకుంటున్నది. వివరాల్లోకి వెళితే... మధిర పట్టణంలోని రైల్వే ట్రాక్ పక్కన బిల్లకంటి రాములు బిల్లకంటి లక్ష్మయ్యలకు సంబంధించిన ఓ భవనం ఉంది. ఇద్దరు అన్నదమ్ములు

మిగతా 2లో..

# మన పాలన ప్రజా రంజకం కావాలి

**- సమస్యల పరిష్కారమే మొదటి ఎజెండా**
**-ఏ ఎన్నికలైనా సిపిఐదే విజయం**
**- సర్పంచుల అభినందన సభలో కూనంనేని**







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ అజేయ శక్తిగా నిలిచిందని, అవాకులు చెవాకులు పేలిన వారి నోళ్లు ఒక్క సారిగా మూతపడ్డాయని, గెలిచిన సిపిఐ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల నిస్వార్థంగా, పారదర్శకంగా ప్రజారంజక పాలన అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డుసభ్యుల అభినందన సభ శుక్రవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ గెలిచిన సిపిఐ అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయితీల్లోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

మిగతా 2లో..

# మన పాలన ప్రజా రంజకం కావాలి







(మొదటిపేజీ తరువాయి)

చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండాగా ఉండాలని సూచించారు.పోటా పోటీగా ఒంటరి పోరుకు దిగిన సిపిఐ జిల్లా వ్యాప్తంగా 47 సర్పంచ్ స్థానాలను మంచి మెజార్టీతో గెలుచుకుందని, అదే విధంగా 57 ఉపసర్పంచ్ పదవులు దక్కించుకోగా, 432 వార్డుల్లో ఎర్రజెండా రెపరెపలాడుతోందన్నారు. మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ ఖాతాలో పడ్డాయని తెలిపారు. తాము కాకలు తీరిని రాజకీయ పండితులం అని చెప్పుకునే వారి ప్రాంతాల్లో కూడా సిపిఐ దూసుకుపోయిందని, కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే సిపిఐకి అత్యధిక ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ముగిసిన ఎన్నికల్లో సిపిఐకి కాంగ్రెస్ పార్టీ కనీసం మద్దతు తెలపలేదని, కానీ సిపిఐ స్నేహధర్మాన్ని పాటిస్తూ గతంలో కాంగ్రెస్ సర్పంచ్‌లు ఉన్న స్థానాల్లో తాము పోటికి నిలుపలేదని చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగితూ దిగజారుడు రాజకీయాలు చేశారని, విలువలతో కూడుకున్న రాజకీయాలు, క్రమశిక్షణతో ఉన్న తాము తప్పిదాలకు తావివ్వలేదని చెప్పారు. కొందరు సిపిఐది ఏముందిలే, గత అసెంబ్లీ ఎన్నికల్లో తామే గెలిపించాం, వాళ్లకు అంత సీన్ లేదంటూ అవాకులు చెవాకులు పేలారని, కానీ దిమ్మదిరిగే ఫలితాలు సొంత కావడంతో ఇప్పుడు వారు ఎక్కడున్నారో కూడా అంతు చిక్కడం లేదని యద్దేవా చేశారు. ఇప్పటికైనా మాటలు జారడం మానుకుని స్నేహ బంధాన్ని నిలుపుకుంటే మంచిదని హితవు పలికారు. త్వరలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరగబోతున్నాయని, ఆ తర్వాత మున్సిపాలిటీ, కార్పోరేషన్ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా సిపిఐ దే పై చేయని, ఆ నాటి రాజకీయ పరిస్థితులు, ఆయా పార్టీల రాష్ట్ర పెద్దల నిర్ణయాల మేరకు కార్యచరణ ఉంటుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని, ఓటమి పాలైన వారు కృంగిపోకుండా రానున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు మనోధైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు మెమోంటోలు అందజేసి షాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాసరావు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గరాశి వెంకటేశ్వర్లు, వి పూర్ణ చంద్రరావు, మున్నా లక్ష్మీ కుమారి, కే సారయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, రేసు ఎల్లయ్య, ఎస్‌డి సలీం, చంద్ర నరేంద్ర కుమార్, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టిరాహుల్, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సారూ.. ఇదేం న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ఉండడంతో ఆస్తి మొత్తం బిల్లకంటి రాములు పేరు పైనే ఉంది. రాములుకు సంతానం లేకపోవడంతో చింతల ప్రసాద్‌ను దత్తత తీసుకున్నారు. ప్రసాద్ రాములు సతీమణికి సమీప బంధువు. కొద్ది రోజుల తర్వాత రాములు పేరుపై ఉన్న ఆస్తి ప్రసాద్ పేరున రాయించే క్రమంలో లక్ష్మయ్య, రాములు కుటుంబాల మధ్య పంచాయతీ జరిగింది. ఇందులో భాగంగా ఖమ్మం లడఖ్ బజార్‌లోని ఇంటినెం. 12/126లో గల ఆర్‌సిసి భవనంలోని రెండు గదులను లక్ష్మయ్య కుమారుడు బిల్లకంటి నాగేశ్వరరావుకు 1988 ఏప్రిల్ 20న చింతల ప్రసాద్ రిజిస్ట్రేషన్ చేశాడు. అప్పటి నుంచి ఈ రెండు గదులను బిల్లకంటి నాగేశ్వరరావు ఆయన మరణానంతరం ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు అనుభవిస్తున్నాడు. ఇందులో వెంకటేశ్వర్లు ఒక చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని స్వయం పోషణ చేస్తున్నాడు. అయితే ఇటీవల ఆ భవనం హైదరాబాద్, విజయవాడ రైల్వే మూడవ నిర్మాణం క్రింద తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులు ఇచ్చి ఆ తర్వాత పరిహారాన్ని చెల్లించారు. అయితే ఈ భవనంలో కొంత భాగం మాత్రమే రైల్వే ట్రాక్ క్రింద పోతుండగా భవనం మొత్తం కూల్చాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు. సంబంధించి లిఖిత పూర్వక నోటీసు కూడా ఇచ్చారు. కానీ ఈ భవనంలో భాగమైన బిల్లకంటి నాగేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వర్లుకు పరిహార సమయంలో కానీ ఆ తర్వాత కానీ ఎటువంటి సమాచారం ఇవ్వకపోగా నవంబర్ 28న ఆ గదులను కూల్చివేయాలంటూ నోటీసులు జారీ చేశారు. 2024 నవంబర్‌లో పరిహార విషయమై మధిర తహసీల్దార్‌తో పాటు ఖమ్మం ఆర్డీవోను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. గతేడాది నవంబర్‌లో ఖమ్మం ఆర్డీవో దీనిని పునః పరిశీలన చేయాలని మధిర తహసీల్దార్‌కు లేఖ పంపించారు. అయినా ఇంత వరకు స్పందించ లేదు. తమకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండానే భవనాన్ని ఎలా కూల్చమంటారని మధిర తహసీల్దార్‌ను బాధితులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కలగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఆ రెండు గదులకు సంబంధించి తమకు సర్వ హక్కులు ఉన్నాయని బాధిత కుటుంబం తెలిపింది. ఆ రెండు గదులలో చిన్న దుకాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ఆ ఆధారం కోల్పోతే మా కుటుంబం వీధిన పడుతుందని అధికారులు ఆవేదనను అర్థం చేసుకుని వాస్తవాలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని బిల్లకంటి వెంకటేశ్వర్లు కోరుతున్నాడు.

# ఖమ్మంలో శరవేగంగా అభివృద్ధి పనులు

(మొదటిపేజీ తరువాయి)

అమరావతిలో నిర్మించే టిటిడి దేవాలయ నిర్మాణ రీతిలో ఖమ్మంలో కూడా ఆలయాన్ని నిర్మించనున్నామని ఇప్పటికే 17.5 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని మరో రెండున్నర ఎకరాల భూమిని త్వరలో కేటాయిస్తామన్నారు. ఖమ్మంకు స్వామి నారాయణ్ గురుకుల విద్యాలయం రావడం అభినందనీయమని స్థలం కేటాయించడంతో స్వామి నారాయణ్ విద్యాలయం పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఖమ్మంలో హైదరాబాద్ శిల్పారామం తరహాలో నిర్మాణం చేసేందుకు లకారం ట్యాంక్ బండ్ సమీపంలో భూమి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

### జూన్ నాటికి సాగునీరు...

సీతారామ ప్రాజెక్టు ద్వారా జూన్ నాటికి సాగునీటిని అందించనున్నట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రధాన కాలువల నిర్మాణానికే అంచనాలు వేశారని ఇప్పుడు డిస్టిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. జూలూరుపాడు, పాలేరు టన్నెల్‌ను పూర్తి చేసి సాగునీటిని అందిస్తామని పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజక వర్గాల్లో 25 వేల ఎకరాలకు జూన్ నాటికి నీరందించేవిధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. భూసేకరణ సమస్య కూడా పూర్తయిందన్నారు. సీతమ్మ సాగర్‌కు సిడబ్ల్యూసి అనుమతి వచ్చిందని మరి కొన్ని అనుమతులు రావాల్సి ఉందన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మరింత విస్తరించనున్నామని ఇందుకు గతంలో 23 చెరువులు నింపేందుకు మాత్రమే ప్రణాళికలు రూపొందించగా ఇప్పుడు అదనంగా మరో 17 చెరువులు నింపేందుకు పనులు చేపట్టామని ఉగాది నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. మీడియా సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-అదనపు ఎస్‌పి సైబర్ క్రైమ్ భిక్షంరెడ్డి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్‌పి సైబర్ క్రైమ్ హైదరాబాద్ జి. భిక్షంరెడ్డి తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో డిజిటల్ మోసాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్‌పి జి. భిక్షం రెడ్డి, ఎస్‌బిఐ ఆర్‌ఎం రాజశేఖర్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి సిహెచ్‌ఆర్‌వి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో భాగంగా ఖమ్మంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం సమాజంలో వివిధ రకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. సైబర్ మోసాల పట్ల విద్యార్థులు, యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్ట్ స్కాములు, కుటుంబ సభ్యులకు ప్రమాదం జరిగిందని, లాటరీలో డబ్బు గెలిచారని వంటి తప్పుడు సమాచారంతో బాధితులను మోసం చేస్తున్నారన్నారు. మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు భావిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని, ఆన్‌లైన్‌లో కంప్లయింట్ చేయాలని, ఖాతా ఉన్న బ్యాంకుకు సమాచారం అందించాలన్నారు. బ్యాంకు ఖాతా నెంబర్ ఓటిపి చెప్పాలని వంటి మోసపూరిత ప్రకటనలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కె. నరేష్, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ ఆపరేషన్స్ ఫయాజ్ భాషా, ఎస్‌బిఐ జెడ్పి బ్రాంచ్ మేనేజర్ షేక్ ఇబ్రహీం, ఎస్‌ఐలు రంజిత్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బుకింగ్ యాప్‌తో సులభంగా ఎరువులు పొందవచ్చు



**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండకుండా బుకింగ్ యాప్ ద్వారా సులభంగా ఎరువులు పొందవచ్చునని ఏఈవో బి. శిరీష రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బుద్దారం గ్రామంలో ఎరువుల బుకింగ్ యాప్ గురించి రైతులకు ఏఈవో శిరీష అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగు చేసిన పంటలకు సరిపడ యూరియా సకాలంలో అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. యూరియా బుకింగ్ యాప్ ఈనెల 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వస్తుందన్నారు. రైతులు ఈ యాప్ ద్వారా ఎలా బుక్ చేసుకోవాలో వివరించారు. రైతు యూరియా బుకింగ్ చేసిన వెంటనే బుకింగ్ ఐడి నెంబర్ అందుతుందని ఆ ఐడి నెంబర్‌తో పాటు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని మరుసటి రోజు సంబంధిత డీలర్ వద్ద యూరియా కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు అరవిందరావు, రామాచారి, దామోదర్‌రావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరదలు, ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

## -సిఎస్ కె. రామకృష్ణారావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వరదలు, పారిశ్రామిక ప్రమాదాల నివారణపై అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. వరదలు, పరిశ్రమ ప్రమాదాల నియంత్రణపై శుక్రవారం జాతీయ విపత్తుల నిర్వహణ అధారిటి ఆధ్వర్యంలో ఎన్‌డిఎంఏ అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వీడియో సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్లు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్, ఎన్‌డిఎంఏ అధికారులు జిల్లాలలో వరదలు, పరిశ్రమల ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై ముందస్తుగా జిల్లాలలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అధారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదలు, పరిశ్రమ భారీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించేలా కార్యాచరణ తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయాలు ముస్తాబు





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. నూతనంగా ఎన్నికైన పాలక వర్గం బాధ్యతల స్వీకరణ ఈనెల 22న సోమవారం జరగనుంది. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు బాధ్యతల స్వీకరణ అనంతరం తొలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. మండలంలో పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. 2024 జనవరిలో పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది. 23 నెలల తర్వాత కొత్త పాలక వర్గం గ్రామ పంచాయతీల్లో కొలువు దీరనున్న నేపథ్యంలో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సైన్స్ మ్యూజియంను వెంటనే ప్రారంభించాలి

## -ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సైన్స్ మ్యూజియంను తక్షణమే ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పాత డిఈవో కార్యాలయంలోనే సర్వశిక్షాభియాన్ గదులను సైన్స్ మ్యూజియంకు కేటాయించి ఏడాదైనా ప్రారంభోత్సవానికి ఇప్పటి వరకు నోచుకోలేదన్నారు. సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసి దాతల సహకారంతో రూ.1.50 కోట్ల విరాళాలు సేకరించి సైన్స్ పరికరాలను కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. ఎంతో విలువైన ఫిజిక్స్, బయాలజీ, సైన్స్ పరికరాలను కొనుగోలు చేసి సైన్స్ మ్యూజియంలో ఉంచారన్నారు. ఏడాది కాలంగా ఈ మ్యూజియంను ప్రారంభించకుండా గదులకు తాళాలు వేశారని ఆరోపించారు. అధికారులు మారుతున్నారే తప్ప సైన్స్ మ్యూజియం ప్రారంభించడంలో చొరవ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా సైన్స్ మ్యూజియంను వెంటనే ప్రారంభించి విద్యార్థులు తిలకించేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సైన్స్ మ్యూజియం, ప్లాంటోరియం కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి



ప్రయోగాత్మక పద్ధతిలో సైన్స్ పరిజ్ఞానం వికాసిల్లేలా ప్రత్యేక భవన సముదాయాన్ని నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి తరుపున కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ నాగులమీరా, జిల్లా నాయకులు గోపి, పవన్, యుగంధర్, నరేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనసు గెలుచుకున్న వారే నాయకులు

## బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి



**ప్రజాపక్షం/చింతకాని:** ప్రజల మనసు గెలుచుకున్న వారే నిజమైన నాయకులని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పందిళ్ళపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన వత్సవాయి పద్మ గెలుపొందిన విషయం విదితమే. అ సందర్భంగా శుక్రవారం పందిళ్ళపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పద్మను వత్సవాయి రవి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే కమ్యూనిస్టుల అవశ్యకతను పందిళ్ళపల్లి గ్రామ ప్రజలు గుర్తించారన్నారు.ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాడే జానకిరాములు భార్య పద్మ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికవడం ప్రజాసమస్యల పరిష్కారానికి నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వత్సవాయి జానకిరాములు, శాఖ కార్యదర్శి లింగం కోటేశ్వరరావ, నాయకులు కొల్లి నారాయణ, బండ్ల రామయ్య, అలవాల అంజయ్య, ఏసు వెంకటేశ్వర్లు, మండె రవి, అలవాల నారాయణ, ఏసు బాబు తదితరులు పాల్గొన్నారు.

# భట్టిని విమర్శించే స్థాయి కమల్‌రాజుకు లేదు



**ప్రజాపక్షం/ మధిరః** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను, సతీమణి మల్లు నందినిని విమర్శించే స్థాయి మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజుకు లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ఘాటుగా విమర్శించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నువ్వు ఒక మాజీ జెడ్పి చైర్మన్ అని మరచిపోయి నైతిక విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వంగవీడులో పోలింగ్ కేంద్రంలో కౌంటింగ్ జరుగుతుంటే మీ ఏజెంట్లు మీ అభ్యర్థి ఏం చేస్తున్నారని, కౌటింగ్ జరిగేది చిన్న హాల్‌లో పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు అభ్యర్థులు అందరూ ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంటే మీ ఏజెంట్లు ఏం చేస్తున్నారని, లోపల ఏమి జరిగిందో కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు తెలియదా అని ప్రశ్నించారు. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో ఫలితాలు రాకముందే మీ పార్టీ వారు గెలిచారని సంబరాలు చేసుకుని తీరా ఓడిపోయాక దానిని సరిదద్దడం కోసం భట్టివిక్రమార్కపై, మల్లునందినిపై అబండాలు వేస్తున్నారని, రీకౌంటింగ్‌లో ఒకట్రెండు ఓట్లతో గెలుపొందిన ఎంతో మంది స్పంచ్ అభ్యర్థులు ఉన్నారని అన్నారు. అందులో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు కూడా ఉన్నారని, ప్రజా ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎంతో పారదర్శకంగా జరిగాయని, దీనిని తట్టుకోలేకనే బిఆర్ఎస్ నాయకులు లేనిపోని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ వారు ఎలాంటి పనికిరాని విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, మండల బిసిసెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరమణ నాయక్, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పత్తేపరపు సంగయ్య, షేక్.జహంగీర్, బిట్రా ఉద్దండయ్యా, మైలవరపు చక్రి, ఓబులు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో బిఈడి, పిజి కళాశాలకు గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. మస్తాన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని పిజి కళాశాల, బిఈడి కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థినీలకు హాస్టల్ వసతి లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ ప్రాంతాలలో హాస్టల్‌లో ఉండి కళాశాలకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పిజి, బిఈడి కళాశాలలో సుమారు 100 మంది విద్యార్థినీలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాలలో ఉంటూ కళాశాలకు వచ్చేందుకు బస్సులు దొరక్క రోడ్ల వెంట నడుచుకుంటూ వచ్చే క్రమంలో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థినీలకు ఇబ్బందులు లేకుండా పిజి కళాశాలలోనే లేడీస్ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గాంధీ, డివిజన్ కార్యదర్శి రాము, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సౌలభ్యం కోసమే ఫర్టిలైజర్ బుకింగ్ యాప్



**ప్రజాపక్షం/ మధిర :** ప్రస్తుత యాసంగి సీజన్లో యూరియా కొనుగోలు చేసేందుకు వ్యవసాయశాఖ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అమలులోకి తీసుకువచ్చిందని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలోజరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత వానకాలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈయాప్‌ను అమలులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. రైతులు ఈయాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా వారి పంటను, వారికున్న విస్తీర్ణాన్ని అంచనా వేసి జిల్లాలో ఏ డీలర్ అయినా ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూనియాను బుక్ చేసుకోవడం జరుగుతుందన్నారు. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24గంటలలోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. ఏదైనా పరిస్థితుల్లో 24గంటలలోపు యూరియాను తీసుకోకపోతే ఆ బుకింగ్ రద్దు అవుతుందని, మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, ఇందులో పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వాళ్ళు, కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. కౌలుదారులు అయితే వారు ఎవరి దగ్గర అయితే కౌలు తీసుకున్నారో వారి పట్టాదార్ పాస్ బుక్ నెంబర్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించడానికి ప్రతి ఔట్లెట్ దగ్గర వ్యవసాయ శాఖ ద్వారా ఒక వ్యక్తిని నియమించడం జరుగుతుందని, రైతులుందరూ ఈ యాప్‌ను వినియోగించుకుని యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు.

# యాసంగి నారుమళ్లలో జాగ్రత్తలు పాటించాలి

## -ఏవో ఉమామహేశ్వరరెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యాసంగి వరి నారుమళ్లలో తగు జాగ్రత్తలు పాటించని పక్షంలో సక్రమంగా ఎదగక ఎర్రబారి చనిపోతుందని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పుతానితండాలో పర్యటించి పలువురు రైతుల వరి నారుమళ్లను పరిశీలించారు. నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. యాసంగి నారుమళ్లలో చలి తీవ్రత కారణంగా సూక్ష్మ పోషక ధాతువులైన జింక్, ఇనుప ధాతువు (ఐరన్) లోపం వలన నారు సరిగ్గా ఎదగక ఎర్రబారి చనిపోవడం జరుగుతుందని ఏవో తెలిపారు. దీని నివారణకు రైతులు రాత్రి పూట నారుమళ్లలో నిల్వ ఉన్న నీటిని ఉదయాన్నే తీసివేసి కొత్త నీటిని అందించాలని తెలిపారు. సూక్ష్మ ధాతు లోప లక్షణాల నివారణ కొరకు లీటర్ నీటికి ఐదు గ్రాముల జింక్ సల్ఫేట్, ఐదు గ్రాముల అన్నబేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పది రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారి చేస్తే వరి నారు ఆరోగ్యవంతంగా పెరిగి తొందరగా నాటు వేయడానికి అందుతుందన్నారు. తప్పనిసరిగా యాసంగి వరి పంట కొరకు 20 నుంచి 25 రోజుల నారును నాటుకు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకోవాలి : ఏడిఏ కరుణశ్రీ



ప్రజాపక్షం/వైరాః వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు టి.కరుణశ్రీ యూరియా బుకింగ్ మీద (ఫెర్టిలైజర్ ఆప్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు వైరా ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ యూరియా బుకింగ్ ఆప్ నందు రైతులు తమ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయిన తర్వాత తమ పాస్‌బుక్ నెంబర్‌ను ఎంటర్ చేసి పంట విస్తీర్ణ వేసిన పంట సెలెక్ట్ చేసుకొని తమ దగ్గరలోని ఎరువుల డీలర్స్ దగ్గర యూరియా బుక్ చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు కూడా ఈ ఆప్ నందు యూరియా బుక్ చేసుకునే అవకాశం కల్పించారని తెలిపారు. రైతులు దీని ద్వారా ఇంటి దగ్గర నుండే బుక్ చేసుకోవాల్సిందిగా కోరారు. దీనివలన యూరియా సులువుగా బుక్ చేసుకొని గత సీజన్ కంటే సులువుగా బుక్ చేయవచ్చని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సపావత్ సైదులు, రైతులు వీరపనేని కిషోర్, రవీందర్‌రెడ్డి, శేషిరెడ్డి, ముక్కర వెంకటకృష్ణారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుడిపై దాడికి పాల్పడిన మైనార్టీపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండలంలోని హైదర్‌సాయిపేట గ్రామానికి చెందిన కుర్నవల్లి మోహన్‌రావుపై అతని ఇంటిపై దాడికి పాల్పడిన మైనార్టీ వర్గానికి చెందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దలు నిర్ణయం మేరకు అదే గ్రామానికి చెందిన బాణోతు సిమ్లానాయక్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా చేసుకోగా ఉపసర్పంచ్ ఎన్నిక నిర్ణయంలో ఘర్షణలకు పాల్పడి వ్యక్తిగతంగా కుర్నవల్లి మోహన్‌రావు ఇంటిపై అదే గ్రామానికి చెందిన మైనార్టీ వారు కులం పేరుతో దూషించి విచక్షణారహితంగా కర్రలు ఇతర మరణాయుధాలతో మహిళలపై, మోహన్‌రావుపై ఇంటిపై దాడి చేసి గాయపరినందుకు వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు, హత్య ప్రయత్నం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డిని కలిసి విన్నవించారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం, హైదర్‌సాయిపేట సర్పంచ్ బానోతు సిమ్లానాయక్ మూడుసు జాకబ్‌ప్రతాప్, దాసరి శ్రీను, నారమళ్ళ వెంకన్న, దాసరి నాగయ్య, పత్రిక విలేకరులు పప్పుల శ్రీను, పప్పుల వేణు, పాగ యోనా తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లు అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

**బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు**



ప్రజాపక్షం/జూలూరుపాడుః కొత్త సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల మన్ననలు పొందాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైరా నియోజకవర్గంలో గెలుపొందిన కొత్త గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వరకు రాజకీయాలు కొనసాగాలని, గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, బాధ్యతగా ప్రజాసేవ చేయాలని పిలుపునిచ్చారు. రెండేండ్లుగా గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కొత్త పాలకవర్గాలు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ప్రధానంగా తాగు నీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, చెత్త సేకరణ తొలి ప్రాధాన్యతగా భావించి పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కేటాయించిన మాదిరిగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సైతం నిధులు కేటాయించి పల్లెల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలన్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లుతో కలిసికట్టుగా గ్రామస్తులను కలుపుకొనిపోయి అభివృద్ధి చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాతంగా జరిగినందుకు పార్టీ శ్రేణులకు, ప్రజలకు, అధికారులకు, పోలీసులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వైరా ఎస్సై రామారావును కలిసిన శ్రీకాంత్



ప్రజాపక్షం/వైరాః వైరా ఎస్సై పుప్పాల రామారావు, రెండో ఎస్సై పవన్‌ను శుక్రవారం డాక్యుమెంట్ రైటర్ రేచర్ల శ్రీకాంత్, వైరా మున్సిపాలిటీ లైసెన్స్ ఇంజనీర్ సమీర్ మర్యాదపూర్వకంగా కలిసిన వారికి శాలువా కప్పి పూలమొక్కను అందించారు.

# పల్లె ప్రగతి మారేనా..?

**-నూతన సర్పంచులకు సమస్యల స్వాగతం**
**-నిర్వహణకే సరి.. నిధులేవిమరి**





ప్రజాపక్షం/చింతకాని : కొత్తగా ఎన్నికైలన సర్పంచులకు పల్లెల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు, పన్నుల ద్వారా సమకూరే ఆదాయం కేవలం పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు, ట్రాక్టర్ కిస్తీలు, ఇతర పారిశుధ్య వ్యవస్థల నిర్వహణకే సరిపోలేదు.కొన్ని గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేవు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాల్సి ఉంది. పల్లె ప్రకృతి వనాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు డీజిల్ పోయించే పరిస్థితి లేక మూలనపడ్డాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అర్ధబలం, అంగ బలం వినియోగించి ఓటర్నను ప్రసన్నం చేసుకుని గెలుపొందిన నూతన సర్పంచులు ఈనెల 22న పదవీ భాధ్యతలు చేపట్టనున్నారు. అయితే గెలవనైతే గెలిచాంగాని ముందుంది మొసళ్ల పండగ అన్నచందంగా ఉంది సర్పంచుల పరిస్థితి. పంచాయతీల ఖాతాల్లో నిధులు లేవు. గ్రామంలో సమస్యలు కోకొల్లలు. దీంతో పదవీబాధ్యతలు చేపట్టి కుర్చీలో కూర్చున్న నాటి నుంచి ప్రజల నుంచి వచ్చే వినతులను ఎలా పరిష్కరించాలని సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు.

**గ్రామాల్లో ఇవీ సమస్యలు..**

నాటి సర్పంచులు పదవీ విరమణ పొందిన నాటి నుంచి గ్రామాల్లో సమస్యలు పట్టించుకునే వారులేక పేరుకుపోయాయి.గ్రామల్లో పెద్ద ఎత్తున మురుగు, చెత్తా చెదారంతో నిండిపోయిన మరుగు నీటి కాల్వలు శుభ్రం చేయించడం, తాగు నీటి ట్యాంకులు శుభ్రం చేయించడం, తాగునీటి పైప్ లైన్లు గేటువాల్వ్‌ల లీకేజీలు నివారణ, వీధి దీపాల ఏర్పాటు, పలు కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవడం, గృహ విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి నివారణకు చర్యలు తీసుకోవడం వంటి సమస్యలు స్థానికంగా పరిష్కారానికి ఎదురు చూస్తున్నాయి. వీటికి తోడు పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు సమస్యలు ఉండనే ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీలకు ఉన్న ఆర్థిక వనరులతో వీటన్నింటినీ పరిష్కరించడం సర్పంచులకు తలకు మించిన భారమనే చెప్పవచ్చు.

# ప్రజాదరణతో సిపిఐ ఒంటరి పోరాటం

**అతి స్వల్ప తేడాతో చేజారిన సర్పంచ్ పదవి**



ప్రజాపక్షం/జూలూరుపాడుః అత్యంత ప్రతిష్మాత్మకంగా జరిగినటువంటి కొత్తూరు గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన అక్కుల రాములు బిఆర్ఎస్, టీడీపీ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థితో పోరాడి 13 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందడం జరిగింది. అధికార పార్టీ సర్వశక్తులు ప్రయోగించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి అనేక ప్రలోభాలకు గురిచేసి అధికార దుర్వినియోగంతో గ్రామపంచాయతీలో ఉన్న అన్ని ప్రతిపక్ష పార్టీలని కలుపుకొని సిపిఐపై పోటీ చేసి చావుతప్పి కన్నులొట్ట పోయిన చందంగా అతి స్వల్ప తేడాతో గెలిచింది. గ్రామపంచాయతీలోన 8 వార్డు లకు గాను సిపిఐ ఒంటరిగా మూడు వార్డులు గెలిచింది. 7వ వార్డు ఒక ఓటు తేడాతో ఓడిపోవడం జరిగింది. రాత్రికి రాత్రి జడల చింత గ్రామంలో ముత్యాలమ్మ గుడి కట్టిస్తామని దొంగ ప్రమాణాలు చేసి అమాయక భక్తులను , మహిళలను మభ్యపెట్టి, సిపిఐ ను గెలిపిస్తే పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేస్తామని ఇందిరమ్మ కాలనీలను ఆపేస్తామని కొత్త కాలనీలను ఇవ్వమని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ ప్రజలు కమ్యూనిస్టు పార్టీపై ఆదరణతో ఒంటరి పోరాటంలో కూడా గెలుపుకు కేవలం 13 ఓట్లు మాత్రమే వెనకబడింది. అనేక మంది నిరక్షఓటర్లు సిపిఐ గుర్తుపై వేలు ముద్ర వేయడం వల్ల చెల్లకుండా పోయినాయి. అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బిఆర్ఎస్, తెలుగుదేశం పార్టీలు సిపిఐ ను గ్రామ పంచాయతీలో ఎదుర్కొనేందుకు రాజకీయాలను పక్కనపెట్టి ఒకటైనప్పటికీ చావుతప్పి కన్ను లొట్ట పోయినట్టు కేవలం 13 ఓట్ల మెజార్టీ మాత్రమే రావడంతో ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు సిపిఐ పట్ల ప్రజల విశ్వాసం చూసి విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి హామీ రద్దుకు బిజెపి కుట్రలు

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**




ప్రజాపక్షం/సత్తుపల్లిః కమ్యూనిస్టు పార్టీల సహకారంతో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకాన్ని రద్దుచేసి దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కూలీల పొట్ట కొట్టేందుకు కేంద్ర బిజేపి ప్రభుత్వం, బిజెపి పార్టీ నాయకత్వం కుట్రలు చేస్తున్నాయని అట్టి కుట్రలు అడ్డుకుంటామని, ఉపాధి కూలీలను సమీకరించి , పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ హెచ్చరించారు. మండల పరిదిలోని తుమ్మలనగర్ లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీలతో కలిసి దండు పని ప్రదేశంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉపాదిహామీ కూలీలనుద్దేశించి దండు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు పోరాడిఆనాడు యుపిఏ ప్రభుత్వంతో భాగస్వామ్యంలో ఉపాదిహామీ పథకాన్ని తీసుకువచ్చి, కూలీలకు చట్టం తీసుకొస్తే, అట్టి చట్టానికి తూట్లు పొడిచి పని గ్యారంటీ పథకాన్ని తీసినేసి, కూలీలను ఉపాధిహామీ పనికి దూరం చేయాలని కుట్రలను పన్నుతుందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని అడిగిన 15 రోజుల్లో పని ఇవ్వాలని, అదేవిధంగా గ్యారంటీగా వంద రోజులు పని కల్పించాలనే చట్టం ఉందని, ఇట్టి చట్టానికి తూట్లు పొడిచి నేటి బిజెపి ప్రభుత్వం 125రోజులు పనులు కల్పిస్తామని అది ప్రభుత్వం ఇష్టానుసారం సాగుతుందని 60 రోజు హాలిడే గా ప్రకటించి ఉపాధి కూలీలను పనులకు దూరం చేసే కుట్రలకు తెరలేపిందన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా పది శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చి ఈ పథకం కొనసాగించాలని చట్టం చేసిందని, అట్టి చట్టాన్ని నేడు 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చట్టంలో మార్పులు చేశారని ఇప్పటికే ఉపాధి హామీ కూలీలకు పనులు చేసిన కూలి డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రాల నిధులు మొత్తం కేంద్రం కాజేసి, రాష్ట్రంపై భారం మోపి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. పనులు లేని కాలంలో కూలీలకు ప్రభుత్వం పనులు కల్పించి కూలీలకు తిండి పెట్టే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసి మహాత్మా గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని పేర్లు మార్చి వికాసి భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజానిక మిషన్ గ్రామీణ్ క్లుప్తంగా జి రామ్ జి పేరుతో పూర్తిగా ఉపాధి హామీ పథకం లేకుండా చేయడం కోసం కుట్రసాగిస్తుందని ఈ కుట్రను తిప్పికొడుతూ సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కానున్నట్లు దండు ఆదినారాయణ తెలిపారు. ఈ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానికి ఉపాధి హామీ కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# కోవర్ట్స్.. రెబల్స్..!

**-పలు చోట్ల షాడోల తీరు సైతం**
**-పాలేరు లో కాంగ్రెస్‌లో వెన్నుపోటుదారులు**
**-ఓటమిపై కాంగ్రెస్ పోస్టుమార్టం**






ప్రజాపక్షం/నేలకొండపల్లి : పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ లో వెన్నుపోటు దారుల వలన కాంగ్రెస్ చాలా చోట్ల ఓటమి పాలైంది. పక్కాగా గెలిచే స్థానాలలో హస్తం నాయకులే బీఆర్ఎస్ కు సహకరించటం వలనే ఓటమి పాలైయ్యనట్లు పలువురు అభ్యర్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఓటమి పై కాంగ్రెస్ పెద్దలు పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్నారు. పాలేరు నియోజకవర్గంలో ముఖ్యంగా నేలకొండపల్లి మండలంలో కాంగ్రెస్ లో అసమ్మతి నాయకులు తీరని నష్టం చేశారు. 1952 లో ఏర్పడిన నేలకొండపల్లి మేజర్ పంచాయతీ రెండు పర్యాయాలు మినహా...మిగతా పర్యాయాలు మొత్తం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ విద్యావంతురాలు ను బరిలోకి దింపింది. భారీ మెజార్టీతో గెలవాల్సిన అభ్యర్ధి పసుపులేటి శ్రీలత ను కాంగ్రెస్ నాయకత్వం దగ్గర ఉండి ఓడించనట్లు గా చెప్పుకుంటున్నారు. కానీ స్థానిక కాంగ్రెస్ నాయకులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించటం తో చేతులారా మేజర్ పంచాయతీ ని చేజారుకున్నారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ లో నాయకత్వం లోపం స్పష్టంగా కనిపిస్తుంది. కనీసం వార్డులలో వేసిన రెబల్స్ ను కూడ ఉపసంహరించుకోలేకపోవటం చాలా నష్టం చేసింది. కాంగ్రెస్ లో కోవర్ట్స్ ఎక్కువైయ్యారని చర్చ జోరుగా సాగుతుంది. వ్యాపారం చేసుకునే వారిని ఒప్పించి...రంగంలోకి దింపి భారీగా ఖర్చు చేయించారు. కేవలం స్థానిక కాంగ్రెస్‌లో సమన్వయం లేకనే మేజర్ పంచాయతీ కి కోల్పోయారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ లో నాలుగు వార్డులలో రెబల్స్ బరిలో ఉండటంతో పంచాయతీ పోలింగ్ లో కోలుకోలేని దెబ్బతీసింది. మరికొంత మంది లోపాయికారిగా ఒప్పందం చేసుకోవటం వలన కూడ నష్టం బాగానే జరిగింది. ముఖ్య నాయకులు మద్య వర్గపోరు సైతం గెలుపు ఫలితాలపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. చెరువుమాధారం, రాజేశ్వరపురం, కోనాయిగూడెం గ్రామాలలో చాలా వరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు క్రాస్ ఓటింగ్ కు పాల్పడినట్లు సమాచారం. పార్టీ నాయకులు అభ్యర్థి వెంటే ఉండి....కోవర్టులు గా మారారని ఓటమి చెందిన అభ్యర్థులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. పలు చోట్ల వార్డులకు తమకు వేయించుకుని....సర్పంచ్ ఓట్ల ను క్రాస్ చేయించారని తెలుస్తుంది. మరి కొంత మంది ఉప సర్పంచ్ పదవి కోసం కాంగ్రెస్ ను తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద రెబల్స్....కోవర్టుల వలన కాంగ్రెస్ పై ప్రభావం చూపిందని నాయకులు పేర్కోంటున్నారు.

**ఫలితాల పై అధిష్టానం ఆరా...**

పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ లో చోటు చేసుకున్న పరిస్థితుల పై అదిష్టానం పై ఆరా తీస్తున్నారు. వెన్నుపోటు దారుల ను గుర్తించినట్లు సమాచారం. గ్రామాల వారీగా కుట్రదారులు...నమ్మకంద్రోహుల జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. నేలకొండపల్లి మండలం లోని నేలకొండపల్లి, కోనాయిగూడెం, చెరువుమాధారం, రాజేశ్వరపురం తదితర గ్రామాలలో జరిగిన తప్పిదాల కు పాల్పడ్డ వారి పై చర్యలు తీసుకునేందుకు రిపోర్ట్స సిద్ధం చేసినట్లు సమాచారం. మొత్తం మీద కాంగ్రెస్ గెలిచే చోట వెన్నుపోటు వలన ఓటమి పాలు కావటం పై మంత్రి సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. మండల పరిషత్, జడ్పీటీసీ ఎన్నికల లో ఇలాంటి తప్పిందాలు జరగకుండా కుట్రదారుల పై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. అదిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే మరి...

# నూతన సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జూలూరుపాడుః వైరా నియోజకవర్గ పరిధిలోని జూలూరుపాడు మండలంలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మద్ధతుతో గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను మండలకేంద్రంలోని యల్లంకి గార్డెన్ (ఫంక్షన్ హాలు నందు) శుక్రవారం వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఎమ్మెల్యే అభినందించి శాలువాలతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ మండల ప్రజలు మనపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారని, పార్టీలను పక్కన పెట్టి, అందరిని కలుపుకొని పోవాలని సూచించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లోని సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందించాలన్నారు. మీకు అండగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన కొందరు సర్పంచ్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన అధికారులకు అభినందన వెల్లువ




ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండల అధికారులు ఎంతో పకడ్బందీగా ఎక్కడ చిన్నపొరపాటు లేకుండా ఘర్షణలు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుని మండలంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన అధికారులను పిండిప్రోలులో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ కామల్ల సువార్త, ఉపసర్పంచ్ చామకురి రాజు, వార్డు సభ్యులు పసలాది ముత్తయ్య, జాలా ఉమేష్, పదముత్తు సుమలత, కాంపాటి ప్రమీల, పప్పుల ఉపేందర్, చామకురి రేణుక శుక్రవారం పిండిప్రోలు గ్రామ నూతన పాలకవర్గం కలిసి పుష్పగుచ్ఛంతో శాలువాలతో సత్కరించారు. ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్, తహశీల్దార్ లూథర్ విల్సన్ , డిప్యూటీ తహశీల్దార్ సుధీర్, ఎస్సై కూచిపూడి జగదీష్, విద్యాశాఖ ఎఇ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుబ్బారావులను మర్యాదపూర్వకంగా కలిసి స్విట్లు పంపిణీ చేశారు. నూతనంగా ఎన్నికైన పిండిప్రోలు గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు, కులమతాలకతీతంగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎన్నికల సమయంలోనే కేవలం పార్టీలను చూడాలి తప్ప పాలకవర్గం లోఎలాంటి తేడాలు లేకుండా గ్రామంలోని ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పద్మనాభల సుధాకర్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు పరికపల్లి చంద్రశేఖర్, కంపాటి బాబురావు, దొడ్డ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతిని కలిసిన తాటిపూడి సర్పంచ్ అశ్విని



ప్రజాపక్షం/వైరాః వైరా మండలం తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్‌ను వైరాలో ఆయన నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష్ ఉడు సత్యనారాయణ నూతన సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు దంపతులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కృషి చేయాలని ప్రభుత్వం గ్రామం అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తుందని గ్రామంలోని సమస్యలను నివేదిక రూపంలో తయారు చేసి స్థానిక శాసన సభ్యులు రాందాస్‌నాయక్‌కు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, రంగా జనార్ధన్, కె.నర్సింహారావు, జెవిఆర్, దుగ్గిదేవర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కట్ల రంగారావును కలిసిన సర్పంచ్ జవ్వాజి అశ్విని



ప్రజాపక్షం/వైరాః వైరా మండలం తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు శుక్రవారం వైరాలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కట్ల రంగారావు నూతన సర్పంచ్ అశ్వినికి శుభాకాంక్షలు తెలిపి గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంపాటి శేషగిరి, కట్ల నాగరాజు, కట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏను కలిసిన సర్పంచ్ హనుమంతరావు



ప్రజాపక్షం/కారేపల్లి: జూలూరుపాడు మండల కేంద్రంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన బజ్యతండా గ్రామ సర్పంచ్ అభ్యర్ధి వాంకుడోత్ హనుమంతరావు నూతన సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనను వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు పాఠశాల అమృతోత్సవాలు





ప్రజాపక్షం/సత్తుపల్లిః వేంసూరు మండల పరిదిలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమృతోత్సవాల సందర్భంగా 10 వ తరగతి విద్యార్థులకు కందుకూరు పూర్వవిద్యార్థుల సంక్షేమ కమిటీచే 5 మండలాల స్థాయిలో (అశ్వారావుపేట, దమ్మపేట, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు) ప్రతిభా పాఠవ పరీక్షను శుక్రవారం పట్టణంలోని పాత సెంటర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మొత్తం 62 ప్రభుత్వ పాఠశాలలకు గాను 52 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారి ఎన్. రాజేశ్వరరావు ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శైలకుమారి, సంక్షేమ కమిటీ అధ్యక్షలు బండి మురళీధర రెడ్డి, సభ్యులు ఒగ్గు దామోదర్ రెడ్డి,గోలి వర ప్రసాద రెడ్డి, గంధ్ర శ్రీనివాసరెడ్డి, థామస్, రమేష్,సత్యనారాయణరెడ్డి,సోమయ్య,చిట్టి కుమారి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## గెలిచిన అభ్యర్థులకు సన్మానం



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధి లోని పలు గ్రామపంచాయతీలలో సర్పంచ్గా గెలుపొందిన అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు అభ్యర్థులను కల్లూరు లోని డిఎన్‌పి ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకట వీరయ్య మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి పథకాలే సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని ఎప్పుడు ప్రజల మధ్య ప్రజలతో ఉంటూ ప్రజాసమస్యల్లో పరిష్కారం కోసం నిత్యం ప్రజలలోనే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పిటిసి కట్ల అజయ్ కుమార్, మండల పార్టీ నాయకులు పాలెపు రామారావు, ఉప్పు సుబ్బారావు, కాటమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతో సైబర్ నేరాలకు ఫుల్‌స్టాప్



**-ఫోన్ నెంబర్, వ్యక్తిగత వివరాలు ఇవ్వద్దు**
**-సైబర్ మోసాల పట్ల విస్తృత ప్రచారం కల్పించాలి**
**-అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సైబర్ క్రైమ్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ నందు అధికారులు, సిబ్బందికి సైబర్ క్రైమ్ నియంత్రణపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరగకుండా ఉండేందుకు సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.పెరుగుతున్న సాంకేతికతతో నేరాల ప్రవృత్తి మారుతుందని, ప్రతి ఒక్కరికి సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల కొంత మంది వాటిని దుర్వినియోగం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఫోన్ వాడకంలో మనం అప్రమత్తంగా ఉండాలని, బహుమతులు గెలిచారు, రుణం మంజూరైంది. డిస్కౌంట్, వ్యాపారాల రిటర్న్, ప్లాట్‌ల విక్రయం మొదలగు వైవిధ్యమైన కారణాలతో పంపే ఎటువంటి లింకులను క్లిక్ చేయవద్దని కలెక్టర్ సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కాల్ చేసే మోసగాళ్లకు ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత వివరాలు, ఓటిపి తెలియజేయరాదన్నారు. సైబర్ నేరాల్లో అధికంగా బాగా చదువుకున్న వారు చిక్కుకుంటున్నారని, ఆన్‌లైన్ గేమింగ్‌లో చాలా మంది డబ్బులు పెట్టి మోసపోతున్నారని కలెక్టర్ తెలిపారు. షాపింగ్ చేసే సమయంలో మన ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని కలెక్టర్ సూచించారు. మన ఫోన్ బ్యాంకులాగా మారిపోయిందని, నేటి సమాజంలో అధికంగా బ్యాంకుకు వెళ్లే అవసరం ఉండటం లేదని ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఫోన్‌లో ఉన్నప్పుడు మనం అప్రమత్తంగా ఉండాలని అనవసరంగా ఫోన్ వివరాలు ఇవ్వవద్దన్నారు. ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను రెగ్యులర్‌గా మారుస్తుండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, చుట్టు పక్కల ప్రజలకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఉద్యోగులతో కలెక్టర్ సైబర్ క్రైమ్ నియంత్రణకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ అడిషనల్ ఎస్‌పి జి. భిక్షంరెడ్డి, డిఎస్‌పి సిహెచ్‌ఆర్‌వి ఫణీందర్, సిఐ కె. నరేష్, డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం

**-ముఖ్యమంత్రి వద్దకు జర్నలిస్టు ప్రతినిధి బృందం**
**-మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గతంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు సంబంధించి జర్నలిస్టులు శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అధికార యంత్రాంగంతో చర్చించడం జరిగిందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలోనే ఒక ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. టియూడబ్ల్యూజె (ఐజెయు) ప్రతినిధి బృందంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కనకం సైదులు, బొల్లం శ్రీనివాస్ తో పాటు జర్నలిస్టులు వనం వెంకటేశ్వర్లు, భూపాల్, మహేందర్, ప్రశాంత్ రెడ్డి, హరీష్, శ్రీనివాస్, రామారావు, గోపాల్ తదితరులు ఉన్నారు.

# నేటి నుండి యూరియా యాప్

**ప్రజాపక్షం/కల్లూరుః** డిసెంబర్ 20వ తేదీ నుండి యూరియా యాప్ ప్రారంభం కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారిని రూప తెలిపారు. పంట రకం సాగు విస్తీర్ణం ఆధారంగా లెక్కించబడుతుందని ఆధార్ భూమి యజమాని వివరాలు భూమి కలిగి ఉండాలని తదుపరి సమాచారం యాప్ లో పొందుపరచాలని దాని ద్వారా సమీప డీలర్ వద్ద జిల్లావ్యాప్తంగా యూరియా లభ్యతను తెలుసుకోవచ్చని అవసరమైన యూరియా పరిమాణాన్ని ముందుగానే బుక్ చేసుకుని కొనుగోలు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సీజన్ లో యూరియా కోసం ఆందోళన నివారించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంటి నుంచి యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం మొబైల్ లో యాప్ ద్వారా ప్రవేశపెట్టిందని ఏవో అన్నారు. కావున రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులను కోరారు. పూర్తి వివరాలకు వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని వార్తలు తెలిపారు.

# రేజర్ల గ్రామ పాలనలో కొత్త అధ్యాయం



**-రేజర్ల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్**
**-అమ్మ సేవకే అంకితమైన బీమిరెడ్డి సుబ్బారెడ్డి ఆశయం**



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** రేజర్ల గ్రామంలో ఇటీవల నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో బీమిరెడ్డి సుబ్బారెడ్డి కీలక పాత్ర పోషించారు. అమ్మను సర్పంచిగా నిలబెట్టాలన్న ఆశయంతో ముందుకు సాగిన ఆయన, గ్రామాభివృద్ధి, ప్రజాసేవనే ప్రధాన లక్ష్యంగా పనిచేశారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న బీమిరెడ్డి సుబ్బారెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ ల సహాయ, సహకారాలతో గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపి, ఈ నెల 17న జరిగిన ఎన్నికల్లో తన అమ్మను అఖండ మెజార్టీతో సర్పంచిగా గెలిపించుకోవడంలో విజయవంతమయ్యారు. ఈ విజయం ఆయనకు మాత్రమే కాకుండా గ్రామ ప్రజలకు కూడా విశేష ఆనందాన్ని కలిగించింది.నాడు కుటుంబ బాధ్యతలను అమ్మ ఒంటరిగా నిర్వర్తించగా, నేడు అమ్మకు అండగా నిలిచి ఆమెను సర్పంచిగా చేసి ఆశీస్సులు పొందినట్టు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్‌ల సహకారంతో రేజర్ల గ్రామ సర్పంచ్ పదవికి అమ్మను బరిలోకి దించి, సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల స్థానాల్లో కూడా విజయాన్ని సాధించి క్లీన్ స్వీప్ నమోదు చేశారు.అమ్మ కోసం తనయుడు చూపిన నిబద్ధత, పోరాట పటిమను గుర్తించిన గ్రామస్థులు బీమిరెడ్డి సుబ్బారెడ్డిని అభినందిస్తూ ప్రశంసలు వ్యక్తం చేశారు.

# పలువురు ప్రభుత్వ అధికారులను కలిసిన సర్పంచ్ జవ్వాజి అశ్విని



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు శుక్రవారం వైరాలో పలువురు అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. తహశీల్దార్ సురేష్‌బాబు, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్, ఎంపిడివో సక్రియ, ఎంపివో రాజేశ్వరి, వైరా ఎస్సై పుప్పాల రామారావు, సిఐ ప్రసాద్, రెండో ఎస్సై పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

# గుండెపోటుతో యూత్ కాంగ్రెస్ నాయకుడు ఇజ్జగాని సత్యం(నిప్పు) మృతి



**ప్రజాపక్షం/వైరాః** వైరాలో యూత్ కాంగ్రెస్ నాయకుడు ఇజ్జగాని సత్యం(నిప్పు)(35) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఇజ్జగాని సత్యం కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా ఉంటూ శాసనసభ ఎన్నికల్లో వైరా శాసనసభ్యులు రాందాస్‌నాయక్ విజయం కోసం విస్తృత ప్రచారంలో పాల్గొన్నారు. మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులకు అతి దగ్గరగా ఉంటున్న ఇజ్జగాని సత్యం మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు యువతలో ఎంతో పేరు సంపాదించుకున్న నిప్పు మరణించిన వార్త ఒక్కసారిగా వైరాను కుదిపేసింది. నిప్పు మరణంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పిల్లలు రోధిస్తున్న తీరు ప్రతిఒక్కరిని కంటతడి పెట్టించింది.

# బేతుపల్లి పంచాయతీలో దొడ్డా రాజేంద్రప్రసాద్ ఘన విజయం



**12 వార్డుల్లో ఘన విజయం**
**క్లీన్ స్వీప్‌తో రికార్డు సృష్టించిన స్వతంత్ర్య అభ్యర్థి**



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. ఈనెల 17న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర్య సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు) అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించి, ప్రత్యర్థులను సింగిల్ డిజిట్‌కే పరిమితం చేయడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రజల అపూర్వ మద్దతుతో క్లీన్ స్వీప్ సాధించి, గెలుపంటే ఇదేనని చాటిచెప్పారు.స్వతంత్ర్య అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన దొడ్డా రాజేంద్రప్రసాద్, అధికార పార్టీ కాకపోయినా ధైర్యంగా పోటీ చేసి తన ప్యానల్‌ను గెలిపించడంలో విజయం సాధించారు. మండలంలోని 17 పంచాయతీ ఎన్నికలు ఒక ఎత్తయితే, బేతుపల్లి పంచాయతీ ఎన్నికలు మరో ఎత్తుగా నిలిచాయని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ ఉద్దండులు, మండల స్థాయి నేతలు, అధికార యంత్రాంగం ఒక వైపు ఉన్నప్పటికీ, సామాన్యుడిలా బరిలో నిలిచి చరిత్ర సృష్టించడం విశేషంగా నిలిచింది.మొత్తం 12 మంది వార్డు సభ్యులను అఖండ మెజారిటీతో గెలిపించుకోవడమే కాకుండా, తాను కూడా సుమారు 1100 ఓట్ల పైన భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. ప్రజలతో కలిసి మమేకమై తిరుగుతూ, పేదల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు)ను బేతుపల్లి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారనే విషయాన్ని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టంగా చూపించాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు) సాధించిన ఈ విజయం స్థానిక రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా ఉందని, 'హ్యాట్సాఫ్ అమ్ములు' అంటూ ప్రజలు, రాజకీయ వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# పాసంగులపాటి రవిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు లాలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాసంగులపాటి రవిని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ పరామర్శించారు. వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ బాధితునితో ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో నాయకులు కట్ల సంతోష్, మిట్టపల్లి నాగి, కట్ల నాగరాజు, దార్న రాజశేఖర్, రేచర్ల రాముడు, రేచర్ల సత్యం, రహీం, చేపల సొసైటీ చైర్మన్ రహీం, పర్సా రవి, బండారు తిరుపతిరావు, కొల్లి రమేష్, కొల్లి రమేష్, చింతనిప్పు ప్రసాద్, మోదుగు వెంకటి, పాసంగులపాటి రమేష్, షేక్ కాసిం, నామ శ్రీనివాసరావు, బాలమర్తి నాగేశ్వరరావు, మెరుగు నాగరాజు, ఎం.రామారావు, తేలూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర తెలియాలి

**- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**
**-రావూరి బుచ్చి రామయ్య, ఆళ్ళ సీతారామయ్య వర్థంతి**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** భావితరాలకు ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దేశంలో కేవలం కమ్యూనిస్టులే పేదల కోసం పోరాటం చేసి వారి హక్కులను కాపాడారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. రావూరి బుచ్చిరామయ్య, ఆళ్ళ సీతారామయ్య మద్దినేని వీరభద్రం వర్ధంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ దేశంలో కమ్యూనిస్టులే పేద ప్రజల కోసం పోరాడి తమ హక్కులను కాపాడారని ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర భావితరాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం భారతదేశంలో బిజెపి మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, భారతదేశంలో బడా పారిశ్రామిక వ్యక్తులను భారతదేశ సంపద దోచి పెడుతుందని దేశంలోనే అతి ముఖ్యమైన ప్రభుత్వం రంగం సంస్థలన ప్రైవేట్ వ్యక్తులను అప్పగించి కార్మికులను మోసం చేస్తుందని ఆయన అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులు గురి చేస్తుందని రైతులు యూరియా సరైన సమయానికి అందించకుండా ఎన్నో ఇబ్బందులు గురి చేసిందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తగినబుద్ధి ప్రజలే చెప్తారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శివర్గ సభ్యులు రాష్ట్ర రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, మండల కార్యదర్శి చీమ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచులను ఘనంగా సన్మానించిన ఎంఎల్ఏ పాయం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలానికి చెందిన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచులను పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు శాలువాలు కప్పి స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి బిక్ష్మ య్య అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో సర్పంచులగా, ఉపసర్పంచులుగా, వార్డు సభ్యులుగా గెలిపించిన ప్రజలకు విశ్వసనీయతతో పని చేసి గ్రామ సమస్యల పట్ల శ్రమించాలని ఈసందర్భంగా ఈనెల ప్రమాణ స్వీకారం చేయబోవు ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. ఎన్నికలు గెలుపు కోసం పని చేసిన కార్యకర్తల శ్రమని గుర్తిస్తూ ఇది కార్యకర్తల విజయమని, కార్యకర్తల శ్రమతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలే మన అభ్యర్థులను గెలిపించాయని ఇది ఏ ఒక్కరి విజయం కాదని కార్యకర్తల సమిష్టి విజయం అని ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, బూరెడ్డి వెంకటరెడ్డి, గాదె వెంకటరెడ్డి, బట్టా సత్యనారాయణ, బచ్చు వెంకటరమణ, నూతన సర్పంచులు, ఇర్పా కవిత, కలివేటి సరిత, జిమ్మా ఝాన్సీ, కోర్సా కృష్ణ, ఎనిక ఉషారాణి, భూరెడ్డి స్వాతి, తెల్లం నాగమణి, మచ్చా నరసింహారావు, ఎట్టి నరేష్, బానోత్ సదర్‌లాల్, సబ్కా పిచ్చయ్య, కుంజా జాను, పోడియం పవన్, యెట్టి నరేష్, కొంద్రు అంజమ్మ, ఉపసర్పంచులు, వార్డు సభ్యులతో పాటు మాదినేని రాంబాబు, కిలారు శేషగిరి, రాగం మల్లయ్య, మాదినేని సుబ్బారావు, సోడే వెంకటేశ్వర్లు, మానాది సైదులు, కుంజా భాస్కర్, ఎస్‌కే ఖదీర్, తెల్లం వీరభద్రం, ఏకాంబరం, సామా క్రిష్ణారెడ్డి, గొల్లపల్లి నరేష్, వెంకటాచారి, వేముల విజయ్, కోలా శశికాంత్, కందుల లక్ష్మ ణ్, ముత్తారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర






**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం నారాయణపురం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెరడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను, వార్డు మెంబర్లను సన్మాన కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పాల్గొన్నారు. ఈసందర్భంగా సండ్ర మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనతో విర్రవీగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పేందుకు బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ సర్పంచ్ ఎన్నికల్లో అపూర్వ విజయాన్ని అందించిన సత్తుపల్లి నియోజకవర్గ గ్రామీణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి నిబద్ధతతో పనిచేయాలని, అధికార పార్టీ నుంచి ఎలాంటి వేధింపులు ఎదురైనా మీకు అండగా నిలిచి పోరాడేందుకు నేను సిద్ధంగా ఉంటానని అన్నారు. సర్పంచ్ ఎన్నికలతోనే కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని, రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి మున్సిపాల్టీ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ పార్టీకి తప్పక ఓటమి ఎదురు కానుందని జోస్యం చెప్పారు. బిఆర్ఎస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రతి గ్రామీణ ఓటురుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు మాపై పెట్టిన నమ్మకాన్ని తగినట్లే బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌ల పనితీరు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పెరిక నాగేశ్వరరావు(చిన్నబ్బాయి), గొడ్ల ప్రభాకర్, కోసూరి ధనలక్ష్మీ , కోడూరు ఉమాదేవి, నల్లగొర్ల రాధ, వనిగండ్ల మాధవరావు, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డిమోహన్‌రెడ్డి, టిడిపి మండల నాయకులు ధూపాటి భద్రరాజు, టిడిపి మండల అధ్యక్షులు సరికొండ శ్రీనివాసరాజు, నాయకులు కేతినేని చలపతిరావు, దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ, మొక్క కృష్ణార్జున్, కర్నాటి లక్ష్మారెడ్డి, ముఖర దోనేష్, వేమిరెడ్డి చిన్నకృష్ణారెడ్డి, పెరిక శ్రీలేఖ, గుంటుపల్లి కుమారి, ఎనిక వెంకట్‌లక్ష్మీ , షేక్.కమల్, సంగసాని శ్రీను, శీలం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# పైసలు పాయే.. పదవి రాకపోయే..!

**-ఓటమితో ఢీలాపడిన అభ్యర్థులు**
**-ఇక మండల పరిషత్ ఎన్నికల కోసం ఎదురుచూపు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 21 గ్రామపంచాయతీలలో హోరాహోరీగా జరిగిన సర్పంచ్ ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థులు డీలా పడి అప్పుల పాలయ్యారు. సర్పంచ్ తో పాటు వార్డ్ అభ్యర్థులు ఖర్చులు వెనకాడకుండా పంపిణీ పోటా పోటీ చేశారు. అర్ధరాత్రి వరకు జరిగిన ఈ పంపిణీలో తక్కువ అభ్యర్థి జనరల్ స్థానాల్లో 60 లక్షలకు పైగా ఎస్సీ ఎస్టీ బీసీ స్థానాల్లో 30 లక్షల వరకు పైగా పంపిణీ కార్యక్రమం జరిగినట్లు గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నవి. గెలవని అభ్యర్థులు కు అప్పులు మిగలడంతో పాటు పదవి రాకపోవడంతో ఆయా కుటుంబాల్లో నిరుత్సాహం నిండి ఉంది. గెలుపే లక్ష్యంగా ఎంత ఖర్చైనా ఆగలేదు. చేసిన అప్పు ఎలా తీర్చాలో ఏమో అయోమయంలో ఉన్నారు. ఫలితాలపై సమీక్ష ఓటమిపాలైన అభ్యర్థులు క్రాస్ ఓటింగ్ ఎక్కడ ఎలా జరిగింది అనేదానిపై కార్యకర్తలు నాయకులతో సమీక్షలు చేసుకుంటున్నారు ఎక్కడ పొరపాట్లు జరిగినది అనేదానిపై విశ్లేషణ చేసుకుంటున్నారు. మండల పరిషత్ ఎన్నికల కోసం ఎదురుచూపులు ఓటమిపాలైన అభ్యర్థులు రాబోయే మండల పరిషత్ ఎన్నికల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులకు ఓడిపోయిన వారు కనీసం మళ్ళీ ఎంపీటీసీలు ఎలాగైనా గెలిచేందుకు పన్నాగం పడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఏవిధంగా ప్రణాళికలు చేయాలో ఇప్పుడే ఓడిపోయిన వారు ఆలోచిస్తున్నారు. పంపిణీ కార్యక్రమానికి కొందరు తట్టుకోలేక చేతులు ఎత్తేశారు.

# కాంగ్రెస్‌కు ఓటేయలేదని వరి ధాన్యాన్ని తడిపిన నాయకుడు..!

**60 బస్తాల వడ్లు నీళ్ల పాలు**
**పోలీసులను ఆశ్రయించిన రైతు**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం గాంధీనగర్ పంచాయతీలోని గంగారం తండా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేయలేదని వరి ధాన్యం ఆరబోసిన కల్లానికి నీళ్లు పెట్టి తన అక్కసును వెలిబుచ్చి రైతుకు భారీ నష్టాన్ని మిగిల్చాడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు. ఈ సంఘటన గురువారం రాత్రి మండలంలో జరిగింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం తండా గ్రామానికి చెందిన కొర్రా చిన్న రాములు రెండు ఎకరాల పొలంలో వరి పంటను సాగు చేశాడు. పంట కోసి పొలంలో కళ్లం చేసి సుమారు 60 బస్తాల ధాన్యాన్ని ఆరబెట్టి తన పనుల్లో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలు జరగడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని చిన్న రాములును ఆదేశించాడు. 3 ఓట్ల మెజార్టీతో అధికార పార్టీ అభ్యర్థి విజయం సాధించాడు. అయినా తాను బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయలేదని అధికార పార్టీ నాయకుడు కోపంతో పొలంలో ఆరబెట్టిన వడ్లపై కరెంట్ మోటర్‌తో సుమారు 60 బస్తాల ఒడ్లు తడిపాడు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని రైతు వాపోయాడు. వరి ధాన్యాన్ని తిరగబోద్దామని వెళ్లి చూడగా ధాన్యంలో మొత్తం నీరు పట్టి ఉందని తెలిపాడు. దీంతో రైతు కేకలు వేస్తూ చుట్టుపక్కల ఉన్న వాళ్లని పిలిచి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికి పూర్తిగా తడిసిపోవడంతో ధాన్యం రంగు మారింది. చుట్టుపక్కలవారు వచ్చి ఆ నీళ్లు ఆపే ప్రయత్నం చేశారు. అయినా సుమారు 60 బస్తాల వడ్లు తడిసిపోయాయి. దీంతో రైతు గ్రామంలోని రోడ్డుపై వరి ధాన్యాన్ని పోసి నిరసన వ్యక్తం చేశాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని తడిసిన వడ్లు పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# పాత్రికేయుడు అంతోటి రాముకు పరామర్శ



**ప్రజాపక్షం/కూసుమంచి:** మూడు రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో కాలుకు సంబంధించి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసుకొని, కూసుమంచి మండల కేంద్రంలో తమ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న కూసుమంచి వెలుగు దినపత్రిక విలేఖరి అంతోటి రామును బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాము త్వరగా కోలుకుని యధావిధాగా తన వృత్తిలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఇటీవల 8వ వార్డు నందు ఘన విజయాన్ని సొంత చేసుకున్న క్రమంలో ఎన్నికల సంబంధిత విషయాలు, వార్డు సంబంధిత సమస్యలు, కూసుమంచి పట్టణ సమస్యలు ప్రస్తావించి, వాటి పరిష్కారం మార్గాలను చర్చించుకున్నారు. ఈకార్యక్రమంలో యువ నాయకులు దామళ్ల కోటి, అడపా శివ, మహమ్మద్ తాహిర్ హుస్సేన్, మండల బిజెపి నాయకులు పొన్నం ఉపేందర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలి

**-అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి సమీక్షించారు. ఖిల్లా రోప్‌వే, సింథటిక్ ట్రాక్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శిల్పారామం, క్రికెట్ స్టేడియం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం, వైద్య కళాశాల, కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్, సమీకృత మార్కెట్, మంచుకొండలో ఎత్తిపోతల పథకం, హరిత హోటల్, టిటిడి దేవాలయం, స్వామి నారాయణ గురుకుల స్కూల్, సీతారామ ఎత్తిపోతల పథకం, వెలుగుమట్ల అర్బన్ పార్కు పనులపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత అనుభవాలకు భిన్నంగా ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మ్యానువల్‌గా చేసే అభివృద్ధి పనులను నరేగా క్రింద బుక్ చేయాలన్నారు. పచ్చదనం పెంచేందుకు గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి పారుదల ప్రాజెక్టు పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం క్రింద మార్చి నాటికి 29 చెరువులు నింపే పనులు పూర్తి కావాలన్నారు. రెండవ విడత క్రింద మరో 17 చెరువులు నింపే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనులు, ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు

**- ఏపిలో కలిపిన ఐదు పంచాయితీలను తెలంగాణకు ఇవ్వాలి**
**- రామలయాభివృద్ధికి రేవంత్ ఇచ్చిన మాట నిలుపుకోవాలి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజనులు, ఆదివాసీలను పాలకులు ప్రక్కన పడేశారని,వారిని మభ్యపెట్టి రేవంత్ రెడ్డి, భట్టి, సీతక్క అధికారంలోనికి వచ్చారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం భద్రాచలంలో పర్యటించారు. ముందుగా శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెలంగాణ టూరిజంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం గిరిజనాభివృద్ధి కోసం ఏ మేరకు ఖర్చు చేశారో స్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గడిచిన ముప్పై ఏళ్లుగా గిరిజన కార్పోరేషన్లో నియామకాలే లేవని మండిపడ్డారు. రోడ్డున పడ్డ గొత్తికోయలు, గిరిజనులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని లేదంటే రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు కొత్తగూడెంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయితీలను తిరిగి తెలంగాణాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం కేంద్రంలోని బిజేపి, ఏపిలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సహకరించాలని కోరారు. బొగ్గు గనులను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల కోసం జాగృతి నిరంతర పోరాటాలు చేస్తుందని చెప్పారు. భద్రాచలం రామాలయాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, అభివృద్ధి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జానంబాటలో భాగంగా ఇప్పటి వరకు 13 జిల్లాలో పర్యటన సాగిందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 14వ జిల్లా అన్నారు.

# నేటి నుండి భద్రాచలంలో ముక్కోటి అధ్యాయనోత్సవాలు

**- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు**
**- 29న తెప్పోత్సవం 30న ఉత్తర ద్వార దర్శనం**
**- భక్తులకు సకల సౌకర్యాలు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో నేటి నుండి ముక్కోటి అధ్యాయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2026 జనవరి 12వరకు అధ్యానోత్సవాలు, 16న విశ్వరూప సేవ జరగనుంది. ఈనెల 20 నుండి 29 వరకు పగల్‌పత్తు, 30 నుండి జనవరి 12 వరకు రావత్తు ఉత్సవాలు జరగనున్నాయి. అదే విధంగా 29వ గోదావరి తీరంలో స్వామివారి విహారం జరగనుంది. దీనిని తెప్పోత్సవం అంటారు. ఇందు కోసం హంస వాహనాన్ని సిద్ధ ంచేస్తున్నారు. అదే విధంగా 30వ తేదిన స్వామివారు ఉత్తర ద్వారం నుండి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ముక్కోటి దేవతలు ఒక్కటై ఉత్తర ద్వారంలో ఈనెల 30న స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తుల కోసం అలయం తరుపున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారు ఈ నెల 20న మత్స్యావతారం, 21న కూర్మావతారం, 22న వరహావతారం, 23న నర్సింహావతారం, 24న వామనావతారం, 25న పరుశురామావతం, 26 శ్రీరామావతారం, 27న బలరామావతారం, 28న శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ముక్కోటి అధ్యాయనోత్సవాల్లో భాగంగా భక్తుల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

# ఏజెన్సీ వైద్య సేవలు స్ఫూర్తిదాయకం

**- వైద్యులకు మంత్రి దామోదర ప్రశంసలు**
**- సచివాలయానికి పిలిచి అభినందించిన వైనం**

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం వైద్యం రోగులకు అందిస్తున్న తీరు ప్రశంసనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. భద్రాచలం ఏజెన్సీలోని ఆస్పత్రి సిబ్బందితో పాటు డిసిహెచ్ఎస్ డా. రవిబాబును హైదరాబాద్ సచివాలయంలోని తన ఛాంబర్‌కు పిలిపించుకున్న ఆయన టివివిపి ఆస్పత్రుల సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రశంసించి ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిష్టియానాతో కలిసి జ్ఞాపికను అందించారు. అంకిత భావంతో పనిచేసే వైద్యులను రోగులు చిరకాలం గుర్తుంచుకుంటారని చెప్పారు.ఏజెన్సీలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా వైద్య సేవలు అందించడం గమనార్హం అన్నారు.



# యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన




**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని నేలపట్ల, మరిపెరిక సింగారం గ్రామాలలో రైతులకు యూరియా బుకింగ్ యాప్ గురించి మండల వ్యవసాయ అధికారి రామదుగు వాణి అవగాహణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుండి అన్ని ఎరువుల దుకాణాలలో యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే యూరియా అమ్మకాలు జరుగుతాయని, రైతులు ఆండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని, మండలంలో యూరియా అందుబాటులో ఉన్న దుకాణాల ద్వారా బుక్ చేసుకుని యూరియా కొనుగోలు చేసుకోవాలని సూచించారు. వారు వేసిన పంటను బట్టి ఎకరాకు సరిపడ మోతాదు ద్వారా యూరియా అందించబడుతుందని, ఐదు ఎకరాల లోపు రైతులకు రెండు దఫాలలో యూరియా అందించబడుతుందని, 5 నుండి 20 ఎకరాలలో రైతులకు మూడు దఫాలలో, 20 ఎకరాల పైబడిన రైతులకు నాలుగు దఫాలలో యూరియా అందించబడుతుందని, ప్రతి దఫాకు 15 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. ఏదైన కారణం వల్ల రైతులు ఏరియా బుక్ చేసుకున్న 24 గంటల్లోపు యూరియా తీసుకొనట్లయితే వారి బుకింగ్ క్యాన్సిల్ అవుతుందని, మరల వారు 24గంటల తర్వాత తిరిగి బుక్ చేసుకోవాలని సూచించారు. యాప్ వినియోగ విషయంలో రైతులు ఎటువంటి ఇబ్బంది పడనవసరం లేదని, వ్యవసాయ శాఖ, అనుబంధ శాల అధికారులు అందుబాటులో ఉండి రైతులకు యూరియా బుకింగ్‌లో సహాయపడతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, సాయిరాం, వంశీ, నవీన్, రవికుమార్, రవీందర్ సౌమ్య, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు నాయకన్ గూడెం, కిష్టాపురం, పాలేరు, చేగొమ్మ, జీళ్ళచెరువు, పోచారం గ్రామాలలో నిర్వహించారు.

# ఎఫ్‌టిఎల్ పరిధిలోని ఆక్రమణలు తొలగింపు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలోని పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జేసిబిలతో అక్రమంగా ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మించిన రేకుల షెడ్లను తొలగించారు. తొలగింపు సందర్భంగా కొంత మంది అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేవలం ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న వాటిని మాత్రమే తొలగించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయకృష్ణ, జిపివో హుస్సేన్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ కాపా ఆదినారాయణకు సన్మానం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** వి.వెంకటాయపాలెం సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన కాపా ఆదినారాయణను సన్మానించారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కుతుంబాక సీతారాం స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనేటి విందులో సర్పంచ్ కాపా ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుతుంబాక సీతారాం శ్రీలక్ష్మి దంపతులు కాపా ఆదినారాయణను సన్మానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దాలని కోరారు.

# హోటల్స్‌పై మున్సిపల్ అధికారుల తనిఖీ

**-పాటించకపోతే చర్యలు తప్పవు : కమిషనర్ గురులింగం**






**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారిల ఆదేశానుసారం శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని పలు హోటల్‌లు, రెస్టారెంట్‌లలో కమీషనర్ గురులింగం ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. యజమానులకు హోటల్‌లు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన మెటీరియల్స్ వాడమని సూచనలు ఇవ్వడం జరిగింది. ప్లాస్టిక్ కవర్లు వాడిన, ఆహార పదార్థాలు నాణ్యత పాటించని వారికి జరిమానా విధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ జి.వీరన్న, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వెంకట్రావు, మున్సిపాల్ సిబ్బంది నాగరాజు, గోపాలరావు, ప్రేమ్ పాల్గొన్నారు.